ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 23 నవంబరు 2025 www.prajaswaramdailly.com 4 pm

# మెట్రో పిల్లర్‌ను ఢీ కొట్టిన బైక్, ఇద్దరు మృతి

సరూర్ నగర్, ప్రజాస్వరం : బైక్ అదుపుతప్పి మెట్రో పిల్లర్ ను ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన సరూర్ నగర్.. విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులను మధు, హరీశ్ లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఆ సమయంలో వారిద్దరూ తాగి ఉన్నారా? అందుకే ఈ ప్రమాదం జరిగిందా? అన్న విషయం పోస్టుమార్టంలో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.




# ప్రేమతో మనుషులను గెలిచారు

## సత్యసాయి శతజయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి




**పుట్టపర్తి, ప్రజాస్వరం:** బాబా ప్రేమతో మనుషులను గెలిచారు. ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని నిరూపించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆంధ్ర పుట్టపర్తిలో నిర్వహిస్తున్న సాయిబాబా శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనడం అరుదైన అవకాశం అన్నారు.ప్రభుత్వాలు కూడా చేయలేని పనులను సత్యసాయి బాబా ట్రస్టు నెరవేర్చిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి చదువు అందించాలని సత్యసాయిబాబా బలంగా విశ్వసించారన్నారు. ఎల్ కేజీ నుంచి పీజీ వరకు పేదలకు ఉచిత విద్యను అందించారని తెలిపారు. చివరి దశలో ఉన్న లక్షల మంది పేదలకు సరైన వైద్యం అందించేలా చేశారన్నారు. పాలమూరు వంటి వలస జిల్లాకు తాగునీటి సదుపాయం కల్పించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకే కాకుండా తమిళనాడులో కూడా తాగునీటి సమస్యను పరిష్కరించిన గొప్ప సమాజ సేవకులు సత్యసాయి బాబా అని కొనియాడారు.

**తన ప్రేమ సందేశం ద్వారా మనుషుల్లో దేవుడిగా శాశ్వత స్థానాన్ని పదిలం చేసుకున్నారని సీఎం తెలిపారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని చేరడానికి అవసరమైన ధైర్యాన్ని సత్యసాయి బాబా అందించారని వెల్లడించారు. 140 దేశాల్లో సత్య సాయిబాబాకు భక్తులు ఉన్నారని వివరించారు. ఆయన మన మధ్యలో లేకపోయినా.. వారి ఆలోచన, స్ఫూర్తి, శతజయంతి ఉత్సవాల్లో కనిపిస్తోందని అన్నారు.**

# స్పీకర్‌కు ఎమ్మెల్యే దానం నాగేందర్ లేఖ



**హైదరాబాద్, ప్రజాస్వరం :** తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ లేఖ రాశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ కు సంబంధించి తనకు ఇచ్చిన నోటీసుకు సమాధానం తెలిపేందుకు మరింత గడువు కావాలని కోరారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది శాసనసభ్యులకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా సమాధానం ఇచ్చిన 8 మందిపై విచారణ జరిగింది. ఇప్పటికే రెండు సార్లు దానం నాగేందర్ కు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఈయన, కడియం శ్రీహరి మాత్రం నోటీసులపై స్పందించేందుకు మరింత గడువు కావాలని కోరుతున్నారు.

# కందుకూరులో సీఎం పర్యటన

### గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన


**రంగారెడ్డి, ప్రజాస్వరం : రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో సీఎం పర్యటించారు. ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్ కు ఏర్పాట్లను పరిశీలించారు. డిసెంబర్ 8, 9లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనుంది.**



# ప్రభాస్ 'స్పిరిట్' స్టార్ట్



**హైదరాబాద్: ప్రభాస్ అభిమానులకు క్రేజీ అప్డేట్ ఇచ్చారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. ఇప్పటికే రాజాసాబ్ అప్డేట్స్ తో సంతోషంగా ఉన్న అభిమానులకు ఫుల్ మీల్స్ లాంటిదని చెప్పొచ్చు.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ కాంబినేషన్లో వస్తున్న చిత్రం స్పిరిట్. తాజాగా ఈ ప్రాజెక్టు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ఆదివారం మొదలైంది. ప్రారంభోత్సవానికి ప్రముఖ నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.**



# పట్టుబిగించిన సౌతాఫ్రికా

**భారత్తో రెండో టెస్టు**

**దక్షిణాఫ్రికా 489 ఆలౌట్**




స్పోర్ట్స్ : గువాహటి వేదికగా భారత్ తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 489 పరుగులకు ఆలౌటైంది. 247/6 ఓవర్ నైట్ స్కోర్ తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆ జట్టు భారీ స్కోరు సాధించింది. ఓవర్ నైట్ 25 పరుగులతో ఆటను కొనసాగించిన ముత్తుసామి (109; 206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్ లు) సెంచరీ చేశాడు. టెస్టుల్లో అతనికిది తొలి శతకం కావడం విశేషం. తొమ్మిదో స్థానంలో వచ్చిన మార్కో యాన్సెన్ (93; 91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్ లు) భారీ ఇన్నింగ్స్ ఆడాడు. 53 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన యాన్సెన్ చివరి వికెట్ గా వెనుదిరిగాడు. కైల్ వెరినె (45; 122 బంతుల్లో) రాణించాడు. భారత బౌలర్లలో కుల్ దీప్ యాదవ్ 4, రవీంద్ర జడేజా, సిరాజ్, బుమ్రా రెండేసి వికెట్లు పడగొట్టారు.

# అందరినీ సంప్రదించిన తర్వాతే నిర్ణయం

**చండీగఢ్ బిల్లుపై కేంద్రం**

**చండీగఢ్, ప్రజాస్వరం:** అందరితో చర్చలు జరిపిన తర్వాతే చండీగఢ్ రాజ్యాంగ అధికరణ 131 సవరణ బిల్లుపై నిర్ణయం తీసుకుంటామని హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. చండీగఢ్ లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకొచ్చేలా సవరణ బిల్లుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని పంజాబ్ లోని పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. "చండీగఢ్ కు చట్టాలను సులభతరం చేసే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ ప్రతిపాదనలో చండీగఢ్ పరిపాలన, పంజాబ్, హరియాణాతో దాని సంబంధాల గురించి ఏమీ లేదు. చండీగఢ్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని.. అందరినీ సంప్రదించిన తర్వాతే ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటాం. రాబోయే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే ప్రణాళిక లేదు" అని హోంమంత్రిత్వ శాఖ అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్ ను కూడా తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

# మంత్రుల వాట్సప్ మీడియా గ్రూపులు హ్యాక్



**హైదరాబాద్, ప్రజాస్వరం : ప్రజలు, ప్రముఖులే కాదు మంత్రులు కూడా సైబర్ కేటుగాళ్ల బాధితులుగా మారారు. తాజాగా పలువురు తెలంగాణ మంత్రుల వాట్సప్ మీడియా గ్రూపులు హ్యాక్ అయ్యాయి. ఎస్బీఐ కేవైసీ పేరుతో ఏపీకే ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు షేర్ చేస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తూ మంత్రులు, జర్నలిస్టులకు ఎస్బీఐ పేరుతో మెసేజ్‌లు పంపుతున్నారు. ఈ ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. అయినా కొందరు అజాగ్రత్తతో వాటిని ఓపెన్ చేసి నష్టపోయి పోలీసులను ఆశ్రయిస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల ఓ సినీ నటుడు కూడా తన కుటుంబంలోని ఒక వ్యక్తి డిజిటల్ అరెస్టుకు బాధితుడయ్యాడని తీరా పోలీసులు వచ్చే సమయానికి వారు పరార్ అయ్యారని చెప్పడం విదితమే.**



# అంధ మహిళల టీ20 వరల్డ్ కప్ విజేత.. భారత్

కొలంబో, ప్రజాస్వరం : ఇటీవల హర్మత్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని కలల కప్పు అయిన ప్రపంచ కప్పును సాధించింది. దేశ ప్రజల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. అలాగే భారత అంధ మహిళల క్రికెట్ జట్టు తొలి టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. నేపాల్ తో జరిగిన మ్యాచ్ లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని భారత జట్టు 12 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఫూలా సరెన్ (44; 27 బంతుల్లో) రాణించింది. తొలిసారి నిర్వహించిన ఈ టోర్నీలో భారత్ తో పాటు ఆస్ట్రేలియా, పాకిస్థాన్, శ్రీలంక, యూఏఈ పోటీపడ్డాయి.